



వ్యాపారుల మాయ

- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్
- ప్రతిరోజూ వ్యాపారులే ధరలు నిర్ణయిస్తున్న వైనం
- డిమాండ్‌కు తగ్గట్టుగా పెరగని పసుపు ధర
- తప్పని పరిస్థితుల్లో విక్రయిస్తున్న రైతులు
- పట్టించుకోని మార్కెట్ కమిటీ అధికారులు

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు అమ్మకాల్లో అంతా వ్యాపారుల మాయాజాలమే కొనసాగుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి పసుపు కొనుగోళ్లు చేపడుతున్నారు. మార్కెట్‌లో మొదటి నుంచి వ్యాపారులదే పైచేయి కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరలకే తప్పని పరిస్థితుల్లో రైతులు పసుపు విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా పసుపునకు ధర చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

నిజామాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు ధర పెరుగుతున్నా వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల మాయాజాలం వల్ల రైతులు నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పసుపు పండిస్తున్న రైతులకు ఈ ఏడే ధర పెరిగినా వ్యాపారులు సిండికేట్ కావడం వల్ల కొద్దిమందికే అత్యధికంగా ధర పెడుతున్నారు. మిగతా వారికి తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఐదేళ్లతో పోలిస్తే రెట్టింపు ధర పసుపునకు వస్తున్నా.. నాణ్యత ఉన్నా పసుపుకంతా మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి ఉన్నా వ్యాపారులు కొద్దిమందే ఉండడంతో వారు చెప్పిందే ధరగా మారుతోంది. ధర మార్కెట్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర మార్కెట్లు, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో పెరుగుతున్నా ఇక్కడి వ్యాపారులు మాత్రం ముందే నిర్ణయించుకొని ధరలు పెట్టడం వల్ల డిమాండ్ ఉన్నరీతిలో రైతులకు మాత్రం రావడం లేదు. రైతుల వద్ద కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మాత్రం ఉత్తరాది వ్యాపారులకు డిమాండ్‌కు అనుగుణంగానే ధరలకు అమ్మకాలు చేస్తున్నారు. అదే మార్కెట్ నుంచి పంపించి పెద్ద ఎత్తున లాభాలను పొందుతున్నారు. ఇదంతా జరుగుతున్నా సమీక్షించి పట్టించుకోవాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు మాత్రం ఎక్కువ ధరలు రావడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోని పసుపునకు డిమాండ్‌కు తగ్గ ధరలు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

జనవరి నుంచి మార్కెట్‌కు కొత్త పసుపు

నిజామాబాద్ మార్కెట్‌కు గత జనవరి నుంచి కొత్త పసుపు వస్తోంది. జిల్లా నుంచే కాకుండా జగిత్యాల, నిర్మల్, ఇతర జిల్లాల నుంచి కూడా పసుపును ఈ మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. ఇక్కడ వచ్చే ధరకు అమ్మకాలు చేస్తున్నారు. కొంతమంది జిల్లాకు చెందిన రైతులు మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కు కూడా తీసుకువెళ్లి అమ్మకాలను చేస్తున్నారు. రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పసుపు అమ్మకాలను సమీక్షించడంతో పాటు ఎగుమతులకు అవకాశం ఇవ్వడం వల్ల ఈయేడు ధర పెరిగింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సాగు తగ్గడం, పసుపునకు డిమాండ్ పెరగడం వల్ల మార్కెట్‌లో తగినంత దిగుబడి రాకపోవడం వల్ల వ్యాపారులు పోటీపడి ఈ పసుపును కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు సరాసరి 4వేల నుంచి 9వేల మధ్య క్వింటాలు అమ్మకం జరిగింది. మెజార్టీ రైతులకు మాత్రం క్వింటాలు ధర రూ.4,500 నుంచి రూ.6500 మధ్యన ఎక్కువగా అమ్మకాలు జరిగాయి. పెరిగిన ఎగుమతులు, జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ పెరగడం వల్ల ఈ యేడు ధర పెరిగింది. గత జనవరి నుంచి కొత్త పసుపు మార్కెట్‌కు వస్తుండగా ధర పెరుగుతూ వస్తుంది. నాణ్యమైన పసుపు క్వింటాలు రూ.18వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. సరాసరిగా మార్కెట్‌లో క్వింటాలు రూ.8వేల నుంచి రూ16,500 మధ్య అమ్మకాలు అవుతున్నాయి. జిల్లాలో గత సంవత్సరం కంటే సాగు గణనీయంగా తగ్గిపోవడం, ప్రతి సంవత్సరం అయ్యే సాగులో సగంకంటే తగ్గడం వల్ల ఈయేడు మార్కెట్‌కు ఎక్కువగా పసుపు రావడం లేదు. గడిచిన జనవరి నుంచి ఇప్పటి వరకు మార్కెట్‌కు కేవలం 2లక్షల 70వేల క్వింటాళ్ల వరకే పసుపు వచ్చింది. గత సంవత్సరం ఈ సమాయానికే 4లక్షల క్వింటాళ్ల వరకు అమ్మకాలు జరిగాయి.

ఈనామ్ ద్వారా ధరల కోట్

ఆ ధరకు అనుగుణంగానే ఉదయం మార్కెట్‌లో పసుపు లాట్‌లకు అనుగుణంగా ధరను ఈనామ్ ద్వారా కోట్ చేస్తున్నారు. ఒక పసుపును ముగ్గురు లేదా నలుగురు వ్యాపారులు చూసినా ధరలో మాత్రం 50నుంచి 100 రూపాయల తేడాతోనే ఎక్కువ మంది కోట్ చేస్తున్నారు. ఒకరిద్దరు మాత్రమే అంతకుమించి పెడుతున్నారు. మార్కెట్‌కు వచ్చే ఎక్కువ పసుపులో ధర క్వింటాలుకు అత్యధికంగా వచ్చే నాణ్యత ఉన్నా.. వ్యాపారులు మాత్రం పెట్టడం లేదు. ఈ మార్కెట్‌లో కొనుగోలు చేసి ఉత్తరాది వ్యాపారులకు సరఫరా చేస్తున్నా ఇక్కడి వ్యాపారులు డిమాండ్‌కు అనుగుణంగా అత్యధిక రేటుకే వారికి సరఫరా చేస్తున్నారు. మార్కెట్ నుంచి కొనుగోలు చేసిన పసుపును అదేరోజు లేదా మరుసటి రోజు లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నారు. రైతుకు వచ్చే క్వింటాలు ధర కంటే ఎక్కువకు అక్కడి వ్యాపారులకు సరఫరా చేస్తూ లాభాలను పొందుతున్నారు. ఇదంతా మార్కెట్ అధికారులకు తెలిసే జరుగుతున్నా పూర్తిస్థాయి అమ్మకాలపై దృష్టిపెట్టిన వారు పట్టించుకోవడం లేదు. కొంత మంది వ్యాపారులు తమ పెట్టుబడులు లేకుండానే ప్రతి రోజూ లక్షల రూపాయల డబ్బులను ఈ పసుపు కొనుగోళ్ల ద్వారా సంపాదిస్తున్నారు. మార్కెట్‌లో అమ్మకాలు జరిగిన రోజే అడ్తిదారులు రైతులకు అవసరమైన డబ్బులను అందిస్తున్నారు. వ్యాపారులు మాత్రం వారికి పదిహేను రోజుల తర్వాతనే ఇస్తున్నారు. రైతులకు అవసరం రీత్యా మొత్తం డబ్బులు తీసు కుంటే వందకు కొంత మొత్తంలో కట్ చేసుకుంటూ రైతులకు డబ్బులను చెల్లిస్తున్నారు. అవసరాలరీత్యా కట్ చేసినా రైతు లు మాత్రం డబ్బులు తీసుకువెళ్తున్నారు. మార్కెట్‌లో అమ్మకాలు చేసే ప్రతి రైతుకు ఎలాంటి కటింగ్ లేకుండా అమ్మకాలు జరిగిన వారంలోపే వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో అంతా సిండికేట్ కావడం వల్ల ఈ వ్యవహారం కొనసాగుతోంది. ధర వచ్చినా పూర్తిస్థాయిలో మాత్రం రైతులకు న్యాయం జరగడం లేదు. గతంలో ఎప్పుడులేని విధంగా మార్కెట్‌లో పసు పునకు ధర వస్తుందని కార్యదర్శి వెంకటేశం తెలిపారు. మార్కెట్‌కు తీసుకువచ్చే రైతులకు ధర అనుకూలంగా రాకపోతే మరుసటి రోజు అమ్ముకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం..

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పసుపునకు డిమాం డ్ పెరిగినా మార్కెట్‌లో వ్యాపారుల మాయా జాలం మాత్రం ఆగడం లేదు. ప్రతిరోజూ మార్కెట్‌కు వచ్చే ఒకటి లేదా ఇద్దరు రైతులకు మాత్రం అత్యధిక ధరను కోట్ చేస్తున్నారు. మిగతా రైతులకు మాత్రం ఆ ధర కంటే 1500 రూపాయలకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే పసుపు సరాసరి క్వింటాలు రూ.8వేల నుంచి రూ16వేల మధ్యనే అమ్మకాలు జరుగు తున్నాయి. మార్కెట్‌కు ప్రతిరోజూ 12వేల నుంచి 15వేల క్వింటాళ్ల మధ్యన పసుపు వస్తోంది. దీనిలో దాదాపు 80శాతం పసుపును 8వేల నుంచి 14వేల మధ్యనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రైతులకు తేమ ఎక్కువగా ఉందని, కర్కుమిన్ శాతం తక్కువగా ఉందని చెప్పి ధరలు తగ్గిస్తున్నారు. రైతులు కూడా గత సంవత్సరం కంటే డబుల్ అంతకు మించి రావడం వల్ల అమ్మకాలు చేస్తున్నారు. నాణ్యమైన పసుపు వచ్చినా కొద్దిమంది రైతులకు మాత్రమే సెలెక్టివ్‌గా ఎక్కువ ధర పెడుతు న్నారు. మార్కెట్‌లో ముందురోజు వచ్చే పసుపునకు వ్యా పారులు సిండికేట్ అయి ధర నిర్ణయిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మార్చి 20: యాసంగిలో జిల్లా రైతాంగం పండించిన ధాన్యం సేకరణ కోసం త్వరలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు, సిబ్బందిని సన్నద్ధం చేశామన్నారు. యాసంగిలో జిల్లాలో వరిసాగు సాధారణ విస్తీర్ణం లక్షా 13,967 హెక్టార్లు కాగా ఈసారి సాధారణానికి మించి లక్షా 66,761 హెక్టార్లలో రైతులు వరిసాగు చేశారని కలెక్టర్ తెలిపారు. 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి చేతికందుతుందని అంచనా కాగా అందులో 7.57 లక్షల మెట్రిక్ టన్నుల వరకు గంగా, కావేరి, ఇతర సన్నరకాలు ఉన్నాయన్నారు. సుమారు 4.15 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యం నిల్వలు చేతికి అందుతాయని ఇతర జిల్లాలు రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు వ్యాపారులతో పాటు స్థానిక వ్యాపారులు సైతం ఆయా ప్రాంతాల్లో రైతులను నేరుగా కలిసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదేవిధంగా స్థానిక అవసరాల కోసం కొందరు రైతులు కూడా తాము పండించిన పంటల నుంచి కొంత మొత్తాన్ని అంటిపెట్టుకోవడం జరుగుతుందన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని ఈసారి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 6లక్షల మెట్రిక్ ధాన్యం సేకరించాలని లక్ష్యం నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 462 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని వీటిలో సహకార సంఘాల ద్వారా 417 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 39, మెప్మా ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందాలని కలెక్టర్ కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఏగ్రేడ్ రకానికి క్వింటా రూ.2203, సాధారణ రకానికి రూ2183ధర చెల్లించడం జరుగుతుందన్నారు. కేంద్రాలలో రైతులకు మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.





డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి రాజీనామా

నిజామాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రకటన ను విడుదల చేశారు. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు తన లేఖను పంపించారు. ఆ లేఖలో డీసీసీబీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ పదవులకు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. తన రాజీనామా లేఖను ఆమో దించాలని రాష్ట్ర కమిషనర్‌ను కోరారు. తనకు సహక రించి



The Nizamabad Dist. Co Operative Central Bank Ltd

To
The Commissioner,
Co-operative Dept.,
Govt of Telangana
Hyderabad.

Sir,

Sub: Resignation for the post of Chairman & Director DCCB, Nizamabad Request for acceptance Regarding.

I am to inform you that, I am sending my resignation for the posts of Director and Chairman DCCB, Nizamabad today 20.03.2024.

Therefore, I request you to accept my resignation with immediate effect.

Thanking you Sir,

Yours faithfully,

(POCHARAM BHASKER REDDY)

డైరెక్టర్లకు, పాలకవర్గ సభ్యులకు, రైతులకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి వాటిని పట్టించుకొని పనిచేసే మనస్తత్వం తనదికాదని ఆ ప్రకటనలో తెలిపారు.

చైర్మన్ రాజీనామాపై సహకార శాఖ అధికారుల తర్జనభర్జన

జిల్లా సహకారబ్యాంక్ చైర్మన్ భాస్కర్ రెడ్డి తన రాజీనామాను రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు పంపించారు. సహకార చట్టం ప్రకారం చైర్మన్‌గానీ, డైరెక్టర్ గానీ పదవికి రాజీనామా చేస్తే నేరుగా వచ్చి అందించాలి. దానిని పరిశీలించిన మీదట సహకారశాఖ అధికారులు ఆమోదించాలి. ప్రస్తుత చైర్మన్ భాస్కర్ రెడ్డి జిల్లా సహకార శాఖ అధికారికి కాకుండా రాష్ట్ర కమిషనర్‌కు పంపించారు. జిల్లాకు సంబంధించి రిజిస్ట్రార్‌గా జిల్లా సహకార శాఖ అధికారి వ్యవహరిస్తారు. పూర్తి నిబంధనలు పరిశీలించిన మీదటనే ఈ రాజీ నామాపై వారు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర సహకారశాఖ అధికారులు ఈ రాజీనామాను ఆమోదిస్తే నేడు జరిగే అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం నిలిపివేయనున్నారు. ఒకవేళ నిబంధనల ప్రకారం చైర్మనే రాజీనామా లేఖను అందించాలని భావిస్తే సమావేశాన్ని నిర్వహించను న్నారు. జిల్లా సహకార శాఖ అధికారి మాత్రం తనకు పూర్తిస్థాయి లేఖ అం దిన తర్వాత పంపిస్తానని తెలిపారు. సమావేశంపై నేడు ప్రకటిస్తానని అధికారి తెలిపారు.



గులాబీ జెండా ఎగరవేస్తాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకతే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది
- హైదరాబాద్‌లో నిర్వహించిన పార్టీనేతల సన్నాహక సమావేశంలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ దఫా గులాబీ జెండాను ఎగరవేస్తామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు వారిపట్ల ప్రజలకు ఏర్పడిన వ్యతిరేకతే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో ఆయన ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులతో బుధవారం రాత్రి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సన్నాహక సమావేశానికి పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్ కుమార్. జగిత్యాల జడ్పీ చైర్మన్ వసంత సురేష్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ మంత్రి రాజేశంగౌడ్‌తో పాటు పలువురు నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలపై చర్చించారు. ప్రచార నిర్వహణ, ఇతర అంశాలపై కార్యకర్తలతో కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ సూచించిన విధంగానే ప్రచారాన్ని నిర్వహిస్తామని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై వివరిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వివరిస్తూ ముందుకు పోతామన్నారు. తెలంగాణ పరిరక్షణ కోసం ప్రజాసంక్షేమం కోసం బీఆర్ఎస్‌ను ఆదరించాలని ప్రజల మద్దతును కూడగట్టడంతో పాటు నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపిస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి ప్రచారాన్ని చేపడతామని తెలిపారు.

నేడు ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

నిజామాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక గురువారం జరగనుంది. మున్సిపాలిటీ ఆవరణలో జరిగే ప్రత్యేక సమావేశంలో చైర్ పర్సన్‌ను ఎన్నుకోనున్నారు. గత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు నెగ్గడంతో ప్రభుత్వం కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు అనుమతినిచ్చింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా చైర్‌పర్సన్ ఎన్నిక అధికారులు చేపడుతున్నారు. బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌గా ఉన్న పండిత్ వినీతపై అవిశ్వాసం నెగ్గడంతో ఈ ఎన్నిక నిర్వహిస్తుండగా ఇద్దరు కౌన్సిలర్లు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కౌన్సిలర్లందరు కాంగ్రెస్‌లో చేరడం వల్ల మున్సిపాలిటీని తమ గ్రిప్‌లో తెచ్చుకున్న ఆ పార్టీ నేతలు అనుకూలమైన వ్యక్తినే చైర్‌పర్సన్‌గా ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జితో పాటు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సొంత పార్టీ కౌన్సిలర్లే పెట్టిన అవిశ్వాసం

నెలన్నర క్రితం అప్పటి చైర్‌పర్సన్ పండిత్ వినీతపై సొంత పార్టీ కౌన్సిలర్లే పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. తర్వాత కోర్టుకు వెళ్లినా అనుకూలంగా తీర్పు రాలేదు. ప్రభుత్వం కూడా ఇన్‌చార్జి చైర్మన్‌గా కొద్దికాలం వైస్ చైర్మన్‌కు బాధ్యతలు ఇచ్చింది. అనంతరం కొత్త చైర్‌పర్సన్ ఎంపికకు ఉత్తర్వులను జారీ చేసింది.



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

గత నెలలో బీఆర్ఎస్‌కు చెందిన 15మంది కౌన్సిలర్లు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరే కాకుండా మరి కొంతమంది కౌన్సిలర్లు కూడా ఆ పార్టీలో చేరారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో మొత్తం 36మంది కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరడం వల్ల అవసరమైన మెజార్టీ కూడా వారికి ఉంది. వీరికి ఎంఐఎం కౌన్సిలర్ కూడా మద్దతు ఇవ్వడం వల్ల కాంగ్రెస్ ఖాతాలోనే ఈ మున్సిపల్ చేరనుంది.

ఇద్దరు కౌన్సిలర్ల పోటీ

మున్సిపల్ చైర్‌పర్సన్ కోసం ఇద్దరు కౌన్సిలర్లు పోటీ పడుతున్నారు. వన్నెల్‌దేవి లావణ్య, ఖాందేష్ సంగీత మధ్య ప్రధాన పోటీ ఉంది. వీరే అప్పటి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టారు. కౌన్సిలర్లతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి వారిని క్యాంపునకు తీసుకువెళ్లారు. సమావేశం ప్రారంభానికి ముందే సభ్యులందరికీ చైర్‌పర్సన్ పేరును తెలిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మూల్యాంకనం విధులకు హాజరుకావాలి

● రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై, రిలీవ్ చేసినా..

విధుల్లో పాల్గొనని అధ్యాపకులపై చర్యలు : డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, మార్చి 20: జిల్లా కేంద్రంలోని ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 22న శుక్రవారం ముందస్తుగా ప్రారంభమవుతుందని, ఇదివరకు నిర్ణయించిన విధంగా ఈ నెల 22నే హాజరుకావాలని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. 22న కామర్స్, కెమిస్ట్రీ, జువాలజీ, హిస్టరీ, బోటనీ సబ్జెక్టులకు సంబంధించిన మూల్యాంకనం ప్రారంభంకానున్న నేపథ్యంలో మూల్యాంకన విధుల్లో పాల్గొనవల్సిన అధ్యాపకులు తప్పక హాజరుకావాలన్నారు. లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటర్ బోర్డ్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే ఆయా కళాశాలల లాగిన్‌లలో నియామకపత్రాలను ఉంచడం జరిగిందని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమం, మోడల్ స్కూల్, కేజీబీవీ, మైనార్టీ, బీసీ రెసిడెన్షియల్, ఇతర అన్ని జూనియర్ కళాశాలల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులను తమ విధుల నుంచి ఈనెల 21న రిలీవ్ చేసి మూల్యాంకన కేంద్రంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై, రిలీవ్ చేసినా విధుల్లో పాల్గొనని అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంటనే అధ్యాపకులు తమకు కేటాయించిన మూల్యాంకన సబ్జెక్టులో రిపోర్ట్ చేయాలని ఆయన కోరారు.

పెరిగిన ఉపాధి కూలీల సంఖ్య

● ప్రతీఒక్కరికి పనులు కల్పిస్తామంటున్న అధికారులు ● వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెరగనున్న కూలీలు



డొంకేశ్వర్‌లో చెరువులో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

డొంకేశ్వర్, మార్చి20: గత నెలతో పోల్చుకుంటే మార్చి నెలలో కూలీల సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాన్ని చేసుకొని ఉమ్మడి డొంకేశ్వర్, నందిపేట్ మండలంలోని కూలీలకు ఉపాధి కల్పించడంలో ముందుంది. గత నెలతో పోల్చుకుంటే ఈనెలలో కూలీల సంఖ్య అధికంగా పెరిగిందని, గత నెలలో 800మంది కూలీలకు పని కల్పించగా మార్చి నెలలో 2200మందికి పని కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో ఉమ్మ డి మండలానికి నాలుగు లక్షల పని దినాలను కల్పించినట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరకు చేరుతుంది. ఈనెలాఖరు లోగా వంద రోజుల పని దినాలు నిండని కూలీలకు ఉపాధి కల్పించేందుకు గ్రామల్లో పనులను వేగం చేస్తున్నారు. ఉమమడి డొంకేశ్వర్, నందిపేట మండల వ్యాప్తంగా 21వేల మంది కూలీలు ఉన్నారు. ఇందులో ప్రస్తుతం 2200మంది తరచుగా కూలీ పనులకు వస్తున్నట్లు ఈజీఎస్ అధికారులు పేర్కొన్నారు. ఉమ్మడి మండలం వ్యాప్తంగా 21వేల మందికి జాబ్‌కార్డులు ఉండగా ప్రస్తుతం 2200 మందికి యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. మండలంలో ప్రతీరోజు 2200నుంచి 2300వరకు కూలీలు ఉపాధి పనులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరా నికి నాలుగు లక్షల పని దినాలు కల్పించాలని, లక్ష్యంతో మండల అధికారులు ముందుకు సాగుతున్నారు. కానీ ఇప్ప టికీ నాలుగు లక్షల పని దినాలు కల్పించినట్లు ఏఈవో సవిత తెలిపారు. అనుకున్న లక్ష్యాన్ని కంటే ఎక్కువగా కల్పించేందుకు ముందుకు సాగుతు న్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ మాసం నుంచి నూతన పని దినాలు ప్రారంభమవుతుండడంతో అప్పుడు పనులకు వచ్చేవారి సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం

మండలంలో వివిధ గ్రామాల్లో ప్రస్తుతం మొక్కజొన్న, పసుపు పంట కోతలు రావడంతో దీంతో కూలీలు వ్యవసాయ పనులకే వెళ్తున్నారు. వచ్చే నెలలో పంట పనులు పూర్తి కావడంతో కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

● రెండు నెలలుగా అందని కూలీ డబ్బులు

గత రెండు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు పని చేసిన డబ్బులు రాక ఇబ్బందులుపడుతున్నారు. జనవరిలో వచ్చిన డబ్బులు తప్ప మళ్లీ ఇప్పటి వరకు కూలీలకు డబ్బులు ప్రభుత్వం నుంచి అందలేవని కూలీలు వాపోతున్నారు. మండుటెండలు పని చేసిన ఉపాధి కూలీలు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. పెరుగుతున్న ధరలు, నిత్యవసర ఖర్చుల సర్దుబాటుకు చేసుకునేందుకు ఇబ్బందులుపడుతున్నారు. ఉమ్మడి మండలంలో ఉపాధి పని చేస్తున్న కూలీలు దాదాపు రెండు నెలల బకాయిల డబ్బుల కోసం పడిగాపులు కాస్తున్నారు. నిజానికి ఉపాధి హామీ పథకంలో పని చేసిన రెండు, మూడు వారాలకే కూలీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. అలా జరగక నెలలుగా కూలీ డబ్బులు అందడంలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీల సంఖ్య పెరిగింది : సవిత, ఏపీవో

మార్చి నెల కావడంతో వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన వారికి కాకుండా వంద రోజుల పని దినాలు దగ్గరలో ఉన్న కూలీలకు పనులు కల్పిస్తున్నాం. గత నెలలో పోల్చు కుంటే ఖూలీల సంఖ్య ఈనెలలో అత్యధికంగా పెరిగింది. ఏప్రిల్ నెలలో కూలీల సంఖ్య అధికంగా పెరిగే అవకాశం ఉంది.

మూడు నెలలుగా డబ్బులు అందలే

వనసేవకుడిగా గత మూడేళ్లుగా పని చేస్తున్న గత మూడు నెలల నుంచి కూలీ డబ్బులు రాక ఇబ్బందిగా ఉంది. కుటుంబ పోషణ భారంగా ఉంది. పని చేసిన వెంటనే డబ్బులు వస్తే బాగుంటుంది.

- ముత్తెన్న, ఉపాధి హామీ కూలీ, మారంపల్లి

మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి : షబ్బీర్‌అలీ





ఇఫ్తార్ విందులో పాల్గొన్న షబ్బీర్ అలీ, హాజరైన నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 20: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ అలీ షబ్బీర్‌అలీ అన్నారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని మాలపల్లి కాలనీ డీలక్స్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో షబ్బీర్ అలీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూఅకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, హరున్‌ఖాన్, ఖుద్దూస్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోటాడిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో మినీ బార్!

● గూపన్‌పల్లిలో మద్యం, మాంసం విక్రయం ● ట్రైనీ ఐపీఎస్‌కు ఫిర్యాదుచేసిన స్థానికులు



నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న రూరల్ పోలీసులు

నిజామాబాద్ రూరల్, మార్చి 20: జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లిలో మద్యంబాబులు హల్‌చల్ చేస్తున్నారు. జనావాసాల మధ్యనే బార్‌ను తలపిస్తూ నిత్యం మద్యం సేవిస్తూ స్థానికులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గూపన్‌పల్లి గ్రామ నడిబొడ్డున ఉన్న మోటాడిరెడ్డి కళ్యాణ మండపాన్ని దీన్ని వేదికగా చేసుకున్నారు. ఇక్కడ ఖరైదన మద్యంతోపాటు మాంసం కూడా విక్రయిస్తూ సిటింగ్‌కోసం టేబుల్స్ ఏర్పాటుచేశారు.దాంతో ప్రతిరోజు ఇక్కడ మద్యంబాబులు మద్యం సేవిస్తూ స్థానికులకు చికాకుతెప్పిస్తున్నారు. బుధవారం గూపన్‌పల్లి లో పోలీసులు కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి వచ్చి స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురు మహిళలు, స్థానికులు మద్యంబాబుల ఆగడాల గురించి స్వయంగా చెప్పి ఆమెను దగ్గరుండి అక్కడికి తీసుకెళ్లారు. అక్కడ టేబుళ్ల వద్ద 20 మంది మద్యం సేవిస్తూ కంటపడ్డారు. నిర్వహిస్తున్న నిర్వాహకుడు గౌడ్‌ను ప్రశ్నించగా, తాను ఎలాంటి అనుమతి తీసుకోలేదని తెలిపారు.ఎన్నికల కోడ్‌ఉన్నందున అనుమతి లేకుండా దాబా, బార్ నిర్వహించడం నేరమని సూచించారు. నిర్వాహకుడిని రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. మద్యంసేవిస్తున్న వారి వివరా లు తీసుకుని వారిని పంపించారు. స్థానికులు, మహిళలు ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.ఎన్నిసార్లు విన్నవించినా తమమాట వినలేదని, చివరికి పోలీసులకు రెడ్‌హ్యాండ్‌గా చిక్కడంతో మినీబార్ బంద్ అయిందని తెలిపారు. ఈమినీ బారన్‌ను గూపన్‌పల్లిలోని స్థానిక నేతలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి

సిరికొండ మార్చి 20 :ఖమ్మం జిల్లా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులపై పెట్టిన పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిరికొండలో విడుదల చేసిన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో పోలీసుల కూంబింగ్‌ను వెంటనే నిలిపి వేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఆశోక్‌ను వెంటనే విడుదల చేయాలని భాస్కర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14న మోటర్ బైక్‌లపై ప్రయాణిస్తున్న వజ్జయ్య(అశోక్),సమ్మయ్యమదార్,సురేష్‌లను కోయచలక సమీపంలో ఖమ్మం పోలీసులు అరెస్టు చేశారని ఆయన పేర్కొన్నారు.ఇల్లందు సమీపంలోని పూసపల్లి వద్ద దళం దొరికినట్లు కేసుపెట్టి అరెస్టులు చేస్తున్నారని భాస్కర్ తెలిపారు. పూసపల్లి కేసును ఎత్తివేసి కూంబింగ్‌లను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గాలికుంటు వ్యాధి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం



గాలికుంటు టీకాలను పశువులకు వేస్తున్న అధికారులు

మోపాల్, మార్చి 20: పశువులకు ఎటువంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతి సంవత్సరం గాలికుంటు వ్యాధి టీకాలను వేయడం జరుగుతోందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జగన్నాథచారి అన్నారు. బుధవారం మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామాల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారని తెలిపారు. మండ లంలో ఉన్న పశువులన్నింటికి ప్రతీ సంవత్సరం టీకాలు వేయడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలో ఒకలక్షా 50వేల ఆవులు, 2లక్షల 20వేల గేదెలు అన్నింటికి టీకాలు వేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్, సుజాత, నరేష్, చిత్ర, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మండల పశు వైద్యాధికారి డాక్టర్ హన్మంత్‌రెడ్డి ఇచ్చారు. గ్రామంలోని సుమారు 610పశువులకు టీకాలు చేస్తూ రైతులకు గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సరళ రాణి, విజయ, స్వప్న, శ్యామల, సత్యం, రైతులు తదితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్, చందమియాబాగ్ తండా గ్రామాల్లో బుధవారం పశువులకు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు పశువులకు, ఆవులకు 979పశువులు, ఆవులకు కలిపి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం



చిన్నారులకు అన్న ప్రాసన చేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 20 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని చేపట్టిందని ఐసీడీఎస్ సీడీపీవో జానకి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని సంఘం గ్రామంలోని రైతు వేదికలో మండల స్థాయి పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో జానకి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు 0-6 ఏళ్ళ మధ్య ఉన్న పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. విద్య, ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తల్లితో పాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు వెయ్యి దినాల ప్రణాళిక ప్రాముఖ్యత విశిష్ఠతను వివరించారు. గర్భధార ణ నుంచి ప్రసవం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పౌష్టికాహారం గురించి, తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణ గురించి పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్యకు ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్పిస్తున్నామని, ప్రైమరీ దశలోనే శిశువులకు విద్యపై అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం శ్రీమంతాలు, అన్న ప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ రాధికా, అంగన్‌వాడీ టీచర్లు సౌజన్య, గంగావేణి, గోపి లక్ష్మీ, ఆసియా బేగం, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: పోషన పక్వడ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు ,చిన్నారుల సంరక్షణకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రసుల్‌బీ అన్నారు. మండలంలోని యానంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పోషన పక్వడ కార్యక్రమంలో డీడబ్ల్యూవో తో పాటు ఇంచార్జ్ సీడీపీవో స్వర్ణల త పాల్గొని మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఆరోగ్య లక్ష్మీ భోజనం తప్పకుండా చేయాలని ప్రతి రోజు పోషక ఆహరం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటరన్నారు. అనంతరం సామూహిక సీమంతలు అన్నప్రసన్న అక్షర అభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైసర్‌లు సరిత, సవిత, శోభా, రాధలక్ష్మీ వరలక్ష్మీ, శ్రీప్రియ, బుజ్జి, భాగ్యలక్ష్మీ, కోఆర్డినేటర్ రాంబాబు, రంజిత్, ఆశ వర్కర్స్ , అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖిల్లా, మార్చి 20: అనారోగ్యంతో మృతి చెందిన రెండు అనాథ మృతదేహాలకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అంత్యక్రియలు నిర్వహించారు. గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన రెండు అనాథ శవాలకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అంత్యక్రియలు నిర్వహించుమని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు కోరగా బుధవారం దేవిథియేటర్ పక్కన గల సార్వజనిక్ స్మశాన వాటికలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. అం త్యక్రియలు నిర్వహించినట్లు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబా తెలిపారు. అనాథలుగా ఎవరూలేని నిస్సహాయ స్థితిలో మృతి చెందిన అనాథ శవాలకు తమ సంస్థ అన్నివారై పోలీసుల అనుమతితో అంతిమ సంస్కారాలు నిర్వహించడంలో ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గం కాసుల సాయి తేజ, మద్దిగంగాధర్, జయదేవ్, ఒకటవ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

జాతీయ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

డిచ్‌పల్లి, మార్చ్ 20: ఈ నెల 10న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి జట్టు ఎంపికలో జిల్లా క్రీడకారులు దీపకీర్తన, (సాంఘిక సంక్షేమ కళాశాల , ధర్మారం(బి)), దేవిశ్రీ, సిందుల(సాంఘిక సంక్షేమ కళాశాల సుద్దపల్లి), వైష్ణవి, నిహరిక (సాంఘిక సంక్షేమ కళాశాల ఆర్మూర్), క్రీడ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చి ఈ నెల 22నుంచి 25 వరకు పంజాబ్ లోని సంగుర్‌లో జరగనున్న 31 వజాతీయ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్ తెలిపారు. క్రీడకారులను బుధవారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ధర్మారం(బి)లో అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల ప్రాంతీయ అధికారిని అలివేలు, జిల్లా అధికారిని సంగీత, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజ, జిల్లా కోశాధికారి మల్లేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు గంగామోహన్, సభ్యులు గంగాధర్, సాఫ్ట్‌బాల్ అకాడమిక్ కోచ్ నరేష్, పీఈటీ జ్యోత్స్న లు పాల్గొన్నారు.

మానాల మోహన్‌రెడ్డిని సన్మానించిన ఏర్గట్ల మండల కాంగ్రెస్ నాయకులు



మానాల మోహన్‌రెడ్డిలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్, మార్చి 20 : తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా నియమితులైన మానాల మోహన్‌రెడ్డిని ఏర్గట్ల మండలంలోని దోంచంద గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏర్గట్ల మండల నాయకులు వంకాయల వెంకట్‌రెడ్డి, కొరిపెల్లి లింగారెడ్డి, మల్లారెడ్డి, అశ్ఫక్, వాసిరెడ్డి హన్మంత్‌రెడ్డి, పెద్ద హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడా రాంమందిర్ వ్యవసాయ భూముల పరిశీలన

నిజామాబాద్ రూరల్, మార్చి 20: జిల్లాకేంద్రంలోని బడా రామమల్, బ్రహ్మపురి, గాజుల్‌పేట్‌తోపాటు శ్రీనుమాన్ దేవాలయంకు సంబంధించిన వ్యవసాయ బూములను దేవాదాయ శాఖ అదికారులు పరిశీలించారు. బుధవారం ఉదయం దేవాలయానికి సంబందించిన వ్యవసాయక్షేత్రాల్లో రెవెన్యూ, దేవాదాయ, సర్వే అధికారులు స్వయంగా పరిశీలించారు. పట్టాభూమికి సంబంధించిన సర్వేనెంబర్‌లను గుర్తించారు. సర్వేనెంబర్ 992లో ఎకరాలు 04.05 గుంటలు, 993లో ఎకరాలు 03.31 గుంటలు, 994లో ఎకరాలు 02.30 గుంటలు, 1001లో ఎకరాలు 02.35 గుంటలు, 1002లో ఎకరాలు 03.33 గుంటలు, 1011లో ఎకరాలు 03.34 గుంటలు, 1012లో ఎకరాలు 02.32 గుంటలు, 1013లో ఎకరాలు 02.24 గుంటలు, 1014లో ఎకరాలు 03.18 గుంటలు, మొత్తం 28 ఎకరాల 32 గుంటల భూమి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సర్వేలో సర్వేయర్‌లు సోమసుదర్శన్, సయ్యద్, దేవాదాయ శాఖ పరిశీలకులు బికమల సమక్షంలో సర్వే నిర్వహించారు. వివిధ ఆలయాల జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యపై అదనపు కలెక్టర్ ఆరా



కొక్యానాయక్ తండాను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్

మోపాల్, మార్చి 20: మారుమూల గిరిజన తతతతండాలో వారు ఎదుర్కొం టున్న తాగునీటి సమస్యపై అదనపు కలెక్టర్ అంకిత్ ఆరా తీశారు. బుధ వారం మండలంలోని అమ్రాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొక్యా నాయక్ తండాను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ తండాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రతీ సంవత్సరం ఎండకాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటోందని గిరిజన వాసులు తెలి పారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నప్పటికీ సరిగా సరఫరా కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఎండ కాలంలో తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదని వారు పేర్కొన్నారు. సమీపంలోని పొలాల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంద న్నారు. ఈ విషయాన్ని మండల స్థాయి అధికారులకు అనేక సార్లు విన్నవిం చిన పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఇప్పటికైనా తాగునీటి సమ స్యను పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌కు తండా గిరిజనులు విన్నవించారు. ఆయన వస్తున్న సమాచారం తెలుసుకున్న మండల స్థాయి అధికారులు హుటా హుటీన తాండాకు చేరుకు న్నారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కిందిస్థాయి అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించినట్లు తండా గిరిజనులు తెలిపారు.

సమాఖ్య సభ్యురాళ్లు లక్‌పతి దీదీ కావాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో అదనపు పీడీ

నిజామాబాద్‌రూరల్,మార్చి 20: మహిళా సమాఖ్య సంఘాల్లోని ప్రతీ మహిళాసభ్యురాలిని లక్‌పతి దీదీగా మార్చాలని, అం దుకు అవ సరమైన అన్ని రుణాలు మంజూరు చేయాలని డీఆర్‌డీవో అదనపు పీడీ రవీందర్ తెలిపారు.బుధవారం రూ రల్ ఐకేపీ కార్యాలయంలో జిల్లా మహిళా సమాఖ్య సమావేశం నిర్వ హించారు. ముందుగా మహిళా ది నోత్సవం సందర్భంగా మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాం క్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ.. ప్ర స్తుత ఆర్థిక సంవత్సరంలో మహిళ లు ఆర్థిక స్థాయిని పెంచుకునే లా చూడాలన్నారు.ఎస్‌హెచ్‌జీ మహిళ లకు లక్ష నుంచి 20 లక్షల వరకు రు ణాలు పొందవచ్చన్నారు. సాధా రణ బీమారూ.2 లక్షలు, ప్ర మా దంలో మరణిస్తే రూ.10 లక్షల వ రకు పొందవచ్చని తెలిపారు. జిల్లాకు వడ్డీలేని రుణాలు 16 కోట్లు మంజూరైనవన్నారు.బీసీటార్గెట్ రూ.1032 కోట్లు రుణాలు 100 శా తం సాధించినట్లు తెలిపా రు. ప్ర భుత్వపాఠశాలల్లో, హాస్టళ్లలో చదివే పిల్లల దుస్తులు యూనిఫారాలు కు ట్టే పనులు తీసుకుని విజయవం తంగాపూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీ పీఎంలు శ్రీని వాస్, సంధ్యారాణి, నీలిమ, సాయి లు, మారుతి, ఏపీఎం లు మహేష్ కుమార్, గంగాధర్‌లు, సమాఖ్య సభ్యులు రాధ, వనిత, మానస తది తరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందేలా చూడాలి :మండవ

డిచ్‌పల్లి, మార్చి 20: ఆకాల వర్షాలతో రైతులకు పంట చేతికి వచ్చే నేలపా లయ్యిందని రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి మాజీ మంత్రి మంత్రులకు లేఖలో పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవ సాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులకు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు లేఖలో విన్నవించారు. గత వారం రోజులుగా ఈదురుగాలు లతో కూడాన వడగండ్ల వర్షంతో రైతుల పంట తీవ్రంగా నష్టపోయారని, పంట నష్టం త్వరగా అంచన వేసి రైతులకు పరిహారం అందించేలా చూడా లని మంత్రులను మాజీ మంత్రి వెంకటేశ్వరరావు కోరారు. కోతలు మొదలు గాక ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధంచేయాలని దళారుల మా ఫియ పెరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ఈవాతావరణ పరి స్థితులను ఆసరా చేసుకొని మిల్లర్లు, కొనుగోలు దారులు నిన్నటి వరకు రూ.2 వేలకు కొన్నవారు ప్రస్తుతం రూ.1900లకు కొనుగోళ్లు చేస్తున్నరన్నారు. మద్ద తు ధర రాక, నిల్వచేయడానికి ఆవకాశం లేక రైతులు ఇబ్బందులు పడు తున్నరని తెలిపారు.

పిప్రిలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల కళాజాతా

ఆర్మూర్‌రూరల్, మార్చి20: ఆర్మూర్ మండలంలోని పిప్రి, ఫత్తేపూర్, గోవి ందపేట్ గ్రామాలలో ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుంది. ఇందులో భాగంగా బుధ వారం గ్రా మంలో శ్రమదానం నిర్వహించి వీధులను శుభ్రం చేశారు. పిప్రిలో ఎన్‌ఎస్ ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించి సా మాజిక సమస్యలైన తాగునీటిని వృధా చేయడం, ప్లాస్టిక్ వినియోగం, మూఢ నమ్మ కాలు, తదితర అంశాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి, ప్రోగ్రాం అధికా రులుయాదగిరి, వెంకటేశ్వర్‌లు, అనిత పవర్, తదితరులు పాల్గొన్నారు.

చెకింగ్ పాయింట్‌ను పరిశీలించిన తహసీల్దార్



పెర్కిట్‌లో చెకింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆర్మూర్‌టౌన్, మార్చి20: మున్సిపల్ పరిధిలోని శివా రులో ఏర్పాటు చేసిన చెకింగ్ పాయింట్‌ను బుధవారం త హసీల్దార్ కె.గజనాన్ పరిశీ లించారు. పార్ల మెంట్ ఎన్ని కల కోడ్ ఉండడంతో చెకింగ్ పాయింట్‌ను కట్టుదీట్టంగా నిర్వ హిస్తున్న విషయాన్ని పోలీసులను అడిగితెలుసులను అడిగితెలుసుకున్నారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాల్సిం దిగా వారికి సూచించారు.

ఘనంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఆర్మూర్‌లో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి జన్మదిన కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి20: ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుకుల పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, ద్యాగ ఉదయ్, పొలకంవేణు, మం దుల బాలు, కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆలూ ర్ మండల కేంద్రంలో మండల బీజేపీ పార్టీ ఆధ్వర్య ంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి పిల్లలకు, వృద్ధులకు కేక్, పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు ఆలయంలో అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తూరు గిరిష్, ప్రధానకార్య దర్శి శ్రీకాంత్, నడిచెరం మల్లయ్య, ప్రళయ్‌తేజ, రమేష్‌యాదవ్, తదిరతులు పాల్గొన్నారు. అదే విధంగా అంకాపూర్ గ్రామంలోని లాలన వృద్ధా శ్రమంలో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆశ్రమ వృద్ధులకు పం పిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలో బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ నందికేశ్వర ఆలయంలో అర్చకులచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్య క్షుడు భూతం సాయరెడ్డి, ఎంపిటీసీ సభ్యులు ఎలిగేటి రాజు, నాయ కులు కల్లెం లింగారెడ్డి, నాగ సురేష్, తదితరులు ఉన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంతో పాటు మారంపల్లి గ్రామంలో బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి జన్మదినం వేడుకలలో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చ ఉపాధ్య క్షుడుమారంపల్లిగంగాధర్,గంగాగౌడ్,నర్సయ్య పాల్గొన్నారు.

పసుపు బోర్డు ప్రకటనలకే పరిమితమైంది

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్నఎమ్మెల్యే భూపతిరెడ్డి, తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ అర్బన్, మార్చి 20:అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించిన అది కేవలం కాగితాలకే పరిమితమైందని ఇప్పటికి పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంలో క్లారిటీ లేదని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విమర్శించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పుడు మార్కెట్‌లో పసుపు ధర పెంపు వ్యాపారుల లబ్ధికోసమేనని దీనిని రైతులెవరూ నమ్మవద్దని ఆయన కోరారు. ప్రధాని హోదాలో మోదీ సైతం పసుపు ధర తమవల్లే పెరిగిందని చెప్పుకోవడం సిగ్గుచేటని పసుపు ధర పెరగడం వల్ల రైతులకు కొంత వరకు లాభం కలుగుతున్న మిగిలిన లాభం అంతా వ్యాపారులకే కలుగుతుందని ఆ వ్యాపారులంతా గుజరాత్ వారేనని ఆయన అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర పర్యటనలో ప్రధానిమోదీ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికి బోర్డు ఏర్పాటు విషయంపై స్పష్టత లేదని ఎక్కడ కూడా కార్యకలాపాలు మొదలు కాలేదన్నారు. గతంలో జిల్లాలో 85వేల ఎకరాలలో పసుపు సాగు అయ్యేదని ప్రస్తుతం అది తగ్గిందని సాగు విస్తీర్ణం తగ్గడం వల్లే ధర పెరిగిందని అందులో బీజేపీ చేసింది, ఎంపీ అరవింద్ చేసిన కృషి ఏమీ లేదన్నారు. తమవల్లే పసుపు ధర పెరిగిందని రైతులను మభ్యపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. రైతులు ఈ విషయంలో బీజేపీని నమ్మవద్దన్నారు. దేశంలో రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలని తెచ్చి వాటిని విమర్శల వల్ల వెనక్కితీసుకున్న ఏకైక ప్రభుత్వం బీజేపీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆధరిస్తారని గత ఐదేళ్లలో ఎంపీ అరవింద్ జిల్లాకు చేసిందేమి లేదన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీజేపీ ప్రయత్నిస్తుందని తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది తప్ప ఎన్నికల కోసం కాదన్నారు. ఈ సమావేశంలో సీని యర్ నాయకులు ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయరెడ్డి, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో పలువురి ఏకగ్రీవ ఎన్నిక



వివరాలు వెల్లడిస్తున్న బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులు

ఆర్మూర్‌టౌన్, మార్చి20: పట్టణంలోని బార్ అసోసియేషన్‌లో పలువు రు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు బుధవారం ఎన్నికల అధికారి గరడి ఆనం ద్, తాళ్ల శ్రీనివాస్‌లు తెలిపారు. నామినేషన్‌ల ప్రక్రియ ముగియడంతో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష స్థానానికి పోడెటి శంకర్, కోశాధికారికి తుమ్మ సుకేష్, లైబ్రరీ సెక్రెటరీకి సూర సురేష్‌లు నామినేషన్‌లు వేయ గా ఆ స్థానానికి ఎవరు నామినేషన్ వేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్ని కైనట్టు వారు తెలిపారు. అధ్యక్ష స్థానానికి తెడ్డు నర్సయ్య, మద్దెపల్లి మో హన్, చిల్క సుబాష్‌లు, ప్రధానకార్యదర్శి దేవరెడ్డి అరుణ్‌కుమార్, బోల్లా రం రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శికి మద్దుల గంగారాం, సిందుకర్ చరణ్‌లు నామినేషన్‌లు వేశారు. స్క్యూటిని, విత్‌డ్రాలు అయిన తర్వాత పోటీలో ఎవరు ఉంటారని తెలుపుతామని వారన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ న్యాయవాదులు శ్రీధర్, జగదీష్, కోనేరు, కృష్ణంరాజు, ఐనర్ అశోక్, ప్రవీన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల దరఖాస్తుకు 23 వరకు గడువు

డిచ్‌పల్లి, మార్చి 20: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులకు ఈ నెల 23తో ముగుస్తు ందని జిల్లా సమన్వయకర్త సంగీత ఒక ప్రకటన లో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవే శ పరీక్ష ఏప్రిల్ 21న ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు స్టోసెటీ వెబ్‌సైట్ సంప్రదించలని సూచించారు.

పార్టీలు మేనిఫెస్టోను విడుదల చేయాలి

పెద్దబజార్, మార్చి 20: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు మేనిఫెస్టోను విడుదల చేయాలని సాధన సమితీ జాతీయ అధ్యక్షుడు జగ్రిపోతుల పరుశురాం డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వల్లనే బ్యాంకింగ్ వ్యవస్థ మొదలైందని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిపై దేశాన్ని పరిపాలి స్తున్న రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకు కోసమే స్వార్థం కోసం చూస్తున్నారే తప్ప దేశానికి రాజ్యాంగం తెచ్చి పెట్టిన మ హానుభావుడు అంబేద్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ఎందుకు ముద్రిం చడం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డిని కలిసిన నేతలు



బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసిన ఎడపల్లి బీఆర్‌ఎస్ నాయకులు

ఎడపల్లి, మార్చి 20: ఎడపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యక ర్తలు బుధవారం బీఆర్‌ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి నిజామా బాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలి పారు. జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో నిజా మాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్ గెలుస్తారని, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఆయన గెలుపునకు కృషి చేస్తామని వారు అన్నారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరాం, నాయకుల ఇస్తారి, మహబూబ్, మేషక్ రాజు, శ్రీనివాస్, మధు, మల్క స్వామి తదితరులు ఉన్నారు.

నిజామాబాద్‌రూరల్: రూరల్ తాజా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవ ర్ధన్‌లు రూరల్ బీఆర్‌ఎస్ నేతలు కలిశారు. బుధవారం జి ల్లా కేంద్రం లోని ఆయన నివాసంలో రూరల్ మాజీ సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, ఇతర నేతలు కలిసిపార్టీ పరిస్థితిని వివరించారు. నిజామా బాద్ పార్లమెంట్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ పోటీచే స్తుండటంతో రూరల్ నేతలు బాజిరెడ్డిని కలిసి పార్టీ ప్రస్తుత పరిస్థితిని తెలిపారు. త్వరలోనే రూరల్ నియోజకవర్గ నేతలతోకలిసి ప్రత్యే క సమావేశం ఏర్పాటుచేయనున్నట్లు బాజిరెడ్డి తెలిపారు.

కాయితీ లంబాడీల సమస్యలు పరిష్కరించాలి

పెద్దబజార్, మార్చి 20: కాయితీ లంబాడీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని రాష్ట్ర బంజారా సమాజ్ సేవా సంఘం అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్ అన్నారు. బుధవారం నగ రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1985 సంవత్సరం నుంచి ఉమ్మడి రాష్ట్రంలో ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో తమకు ప్రభుత్వాల వల్ల తీవ్ర అన్యాయం జరుగు తుందని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా లాభాన, లంబాడీలు, కాయితీ లంబాడీలు సాగు చేస్తున్న పోడుభూముల పట్టాలు ఇవ్వడంలో ప్రభు త్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎంకి తమ సమస్యలను విన్నవించడం జరిగి ందన్నారు. అప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. సమస్యను పూర్తిగా పరిష్కరిస్తా నని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాయితీ లంబాడీలు సభ్యులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో పడి యువకుడి ఆత్మహత్య

రెంజల్,మార్చి20: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎడపల్లి మండలం అంబం గ్రామానికి చెందిన బంద్రపల్లి పోశెట్టి(39)అనే వ్యక్తి గత వారం రోజుల క్రితం అప్పుల విషయంలో భార్యభర్తల మధ్య మనస్పార్థాలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లడంతో అప్పు ఎలా కట్టాలో బాధపడుతూ కుటుంబ స మస్యలతో కలత చెంది జీవితంపై విరక్తి చెంది కందకుర్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి త రలించడం జరిగిందని మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాల్కొండలో రేయిలింగ్‌కు ఢీకొని వ్యక్తి మృతి

ముప్కాల్, మార్చి20: ఉత్తరప్రదేశ్‌కు రోహిత్‌కుమార్(25) బైక్‌పై హైదరాబాద్ నుం చి వారణాసి వెళ్తుండగా మార్గమధ్యంలో రేయిలింగ్‌కు ఢీకొని మృతి చెందిన ఘటన బాల్కొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్, సత్యేంద్రకుమార్‌పటేల్ జీవనోపాధి నిమిత్తం హైదరా బాద్‌లోని పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున హైదరాబాద్ నుంచి హోండా షైన్‌పై ఇద్దరు కలిసి వారణాసికి బయలుదేరి వెళ్లగా మార్గమధ్యంలో బాల్కొం డలోని శ్మశాన వాటిక వద్ద గల నేషనల్ హైవే 44వ వద్ద అతివేగంగా, అజా గ్రత్తగా నడిపి హైవే రోడ్డు పక్కన గల రేయిలింగ్‌కు బైక్ వెనుక కూర్చున్న రోహిత్ కుమార్ ముఖానికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని మామ మిక్కకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం

డొంకేశ్వర్, మార్చి20: పార్లమెంట ఎన్నికల నేపథ్యంలో బుధవారం డొంకేశ్వర్ మండలంలో తహసీల్దార్ వెంకటరమణ బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఫాం-డి ప్రకారం 85ఏళ్ల పైబడి ఉన్న వారికి నేరుగా బీఎల్‌వోలు ఇంటికి వెళ్ళి ఫారం -డిని అందించాలని సూచించారు. దీని ద్వారా ఇంటి నుంచే ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా ఉపయోగపడుతుందని అన్నారు. ఫాం-6 ద్వారా కొత్తగా ఓటరు దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం ఉన్నట్టు చెప్పారు. ఫాం-8 ద్వారా ఓటరు నమోదులో తప్పులను సరిచేసుకునే వేసులుబాటు ఉన్నట్టు సూచించారు. గ్రామాల్లో ప్రతీఒక్కరికి ఓటరుగా నమోదు చేసే విధంగా చూడాలని కోరారు. ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా ఉండే విధంగా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ భక్తిభావనను అలవర్చుకోవాలి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య స్వామిజీ

ఆర్మూర్‌రూరల్, మార్చి20: కొటార్మూర్‌లోని శివపంచాయతన సహిత హనుమాన్ ఆలయంలో బుధవారం విగ్రహాల పున ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విరూపక్ష విద్యారణ్య స్వామిజీ హాజరై పూ జలు నిర్వహించారు. ఆలయంలో వేదమంత్రోచ్చరణాల మధ్య ధ్వజస్తం భాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ప్రతీఒక్కరు భక్తిభా వనను అలవర్చుకోవాలన్నారు. హిందు సాంప్రదాయాన్ని, సాంస్కృతిని ఆచరిం చాలన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో యాజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పెద్ద అన్నదానం నిర్వ హించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యుడు ఇట్టెడి గంగారెడ్డి, గడ్డి కార్తిక్, విద్యాసాగర్‌గౌడ్, సంజీవరెడ్డి, తిరుపతి గౌడ్, మహేష్‌రాజగంగారాం, స్వామి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మోస్రా,మార్చి20: రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ ఆర్‌డీవో రమేష్ రాథోడ్ పరిశీలిం చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల పరిస్థితుల గురించి తహసీల్దార్ మారుతీ, ఉప తహసీ ల్దార్ సాయిలును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచా యతీ సిబ్బంది, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

ఖిల్లా, మార్చి 20: మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులకు న్యాయాధికారి సయ్యద్ ఖదీర్ రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీనారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన 9మంది వారిని గుర్తించి వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా 6మందికి రూ.7వేల జరి మానా విధించారన్నారు. అదేవిధంగా సారంగాపూర్ గ్రామానికి చెందిన పటా న్ షేర్‌ఖాన్, బోయిగల్లికి చెందిన సిర్నాపల్లి భూమేష్, హమల్‌వాడికి చెందిన పెండోట రవికుమార్‌లకు జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు.

కులగణనతోనే వర్గీకరణ సాధ్యం: పిడమర్తి రవి

డిచ్‌పల్లి, మార్చి 20: కులగణనతోనే ఎస్సీ వర్గీకరణ మరియు అన్ని కులాల సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డా.పిడ మర్తి రవి అన్నారు. మాదిగల పార్లమెంట్ నియోజకవర్గ సదస్సులో భాగంగా బుధవారం మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో బరికుండ శ్రీనివాస్ మాది గ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో పిడమర్తి రవి మాట్లాడుతూ.. కుల గణన చేయకుండా బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, తద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ కులాల్లో సమస్యలు అలానే ఉన్నాయని కేవలం కులగణన చేస్తేనే ఎస్సీ వర్గీకరణకు సాధ్యమవుతుందన్నారు.ఉత్తర తెలంగాణ ప్రజలకు అల్ల ర్లకు,మతవిద్వేశాలకు, తావివ్వకుండా వర్గీకరణ చేసే వారికే ఆదరించా లన్నా రు. మాదిగలను మోసం చేయడానికి చూస్తే మోసపోవడానికి సిద్ధంగా లేర న్నారు. 12శాతం జనాభా కలిగిన మాదిగాలకు అన్ని రంగాల్లో వాటా కల్పిం చి న్యాయం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు శ్రీని వాస్, గంగారం, ఎమ్ఎహ్‌పీఎస్ అధ్యక్షుడు ఉపేందర్, సోమనాథం, మాజీ సర్పంచ్ యాదయ్య, నాగేందర్, జనార్ధన్, ప్రశాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలి

కోటగిరి,మార్చి20: ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరితగతిన ప్రారంభించా లని కోటగిరి విండో అధ్యక్షులు కూచిసిద్దు డిమాండ్ చేశారు. కోటగిరి విండో 88వ మహజన సభ బుధవారం విండో అధ్యక్షులు సిద్దు అధ్యక్షతన నిర్వహిం చారు. సంఘం లావాదేవీలను, లాభనష్టాలను వివరించారు. పంటలు చేతికొ చ్చినందున తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని స భ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయడంతో పాటు బోనస్ ఇవ్వాలని తీర్మా నించారు. సంఘం ఆధ్వర్యంలో రైస్ మిల్లును నిర్మించాలని సభ్యులు ఏకగ్రీ వంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు బొట్టే గజేందర్, విండో కార్యదర్శి విఠల్ తదితరులున్నారు.

యంచ గోదావరిలో ప్రమాదవశాత్తు జాలరి మృతి

నవీపేట,మార్చి20: మండలంలోని యంచ గోదావరిలో బుధవారం మేకల లింగం(44)అనే జాలరి ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మండలంలోని మిట్టాపూర్‌కు చెందిన లింగం చేపలు పట్టడానికి యంచ గోదావరిలో దిగగా కాళ్లకు వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని ఆయన పేర్కొన్నారు. మృతు డికి భార్య లావణ్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.235	రూ. 275



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.67,300	రూ.62,000	రూ.785

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : యోధ (హిందీ) (12.50)
: రజాకర్ (3.50, 7.10)
: ప్రేమలు (10.25)
స్క్రీన్-2 : కుంగుఫూ పాండా4 (ఇంగ్లీష్ 3డీ) (2.05, 7.40)
: ప్రేమలు (4.25)
: రజాకర్ (10.00)
స్క్రీన్-3 : సైతాన్ (హిందీ) (1.20, 4.20, 10.30) : గామి (7.20)
స్క్రీన్-4 : రజాకర్ (1.00)
: భీమా (4.15)
: యోధా (7.20, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ప్రేమలు (1.30, 7.30)
: గామి (4.30, 10.30)
స్క్రీన్-2 : రజాకర్ (10.40)
: భీమా (1.40, 4.30, 7.40)
: యోధ (హిందీ) (10.40)
స్క్రీన్-3 : రజాకర్ (1.30, 4.30, 7.30, 10.30)

దేవి : ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్ : భీమా (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : తంత్ర (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్